అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people


## నర్సంపేటలో శాంతిభద్రతలు గాలికి..
# పోలీసుల వైఫల్యమే కారణం

దాడికి గురైన జర్నలిస్ట్ సత్యనారాయణను
పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

04



బుధవారం 17 , జూన్ 2026 సంపుటి :03 సంచిక :126 పేజీలు :05 వెల ₹5




# కాళేశ్వర ఆలయానికి కొత్త కళ

మాస్టర్ ప్లాన్‌పై కమిషనర్ హనుమంతరావు సమగ్ర వివరణ

- ఆలయ ఈఓ కార్యాలయంలో గ్రామస్థులు, భక్తులతో సమావేశం
- నేటి నుంచి బాలాలయంలో స్వామివారి దర్శనాలు
- సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి

02

ళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ఈఓ కార్యాలయంలో గ్రామస్థులు, భక్తులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆలయ మాస్టర్ ప్లాన్, చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలను వెల్లడించారు. ఆలయ విస్తరణ పూర్తయిన అనంతరం ఒకేసారి సుమారు 25 వేల మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉండి సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

_ అక్షరదర్బార్, కాళేశ్వరం



# అవినీతి అనకొండ

- ల్యాండ్ రికార్డ్స్ డీడీపై ఏసీబీ పంజా
- ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు.. 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- రూ.13.05 కోట్ల డాక్యుమెంట్ విలువ గల ఆస్తులు గుర్తింపు.. మార్కెట్ విలువ వందల కోట్లలో
- రూ.1.54 కోట్ల నగదు, రూ.5.04 కోట్ల ఎఫ్‌డీలు, రూ.2.29 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్ స్వాధీనం
- కిలోకు పైగా బంగారం, 8 కిలోల వెండి, విల్లాలు, ప్లాట్లు, లగ్జరీ కార్ల గుర్తింపు

02



# రైల్వే జంక్షన్లపై పోలీసుల నిఘా

- రంగంలోకి 4 స్పెషల్ టీమ్స్
- అంతర్రాష్ట్ర దొంగల ఆట కట్టిస్తాం..
- సీపీ సన్‌ప్రీత్ సింగ్
- కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

03

## ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీల పనివేళల్లో మార్పు

అక్షరదర్బార్, హనుమకొండ: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో పనివేళలు మారాయి. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు డిగ్రీ కాలేజీలు కొనసాగుతున్నాయి. తాజా పని వేళలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 వరకు పరిమితం చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ విజయేంద్ర బోయి, సెక్రటరీ కంభంపాటి శారద, ఓఎస్డీ డాక్టర్ స్నేహలతకి కృతజ్ఞతలు తెలియజేస్తూ టిగారియా ఆధ్వర్యంలో డిగ్రీ లెక్చరర్లు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. అధ్యాపకుల పని భారం సమతుల్యం చేయడమే కాకుండా విద్యా ప్రమాణాలు మెరుగుదలకు, కళాశాలల సమర్థ నిర్వహణకు దోహదపడుతుందని టిగారియా డిగ్రీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఐ రాధిక, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి సత్య శ్రీదేవి పేర్కొన్నారు.

## నేడు జనసేనాని రాక

### బాలుడు నిరంజన్ ను పరామర్శించి భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్న పవన్ కళ్యాణ్



అక్షరదర్బార్, హనుమకొండ: ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బుధవారం హనుమకొండకు రానున్నారు. ఇక్కడి హనుమాన్ నగర్ లో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడు నిరంజన్ ను ఆయన పరామర్శించనున్నారు. షెడ్యూల్ ప్రకారం జనసేనాని ఉదయం 9:45 గంటలకు హనుమకొండ హనుమాన్ నగర్ లోని తన అభిమాని నిరంజన్ ఇంటికి చేరుకుంటారు. నిరంజన్ కుటుంబాన్ని కలిసిన తర్వాత పవన్ కళ్యాణ్ భద్రకాళి ఆలయానికి బయలుదేరుతారు. 10:45 గంటలకు భద్రకాళి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. తర్వాత పవన్ కళ్యాణ్ హైదరాబాదుకు బయలుదేరుతారు. బాలుడి చివరి కోరికగా ఉన్న పవన్ కళ్యాణ్ ను చూడాలనే బాలుడు నిరంజన్ ఆశను నెరవేర్చేందుకు జనసేనాని హనుమకొండకు వస్తున్న నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఏపీ డిప్యూటీ సీఎం పర్యటనను పురస్కరించుకుని మంగళవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ భద్రత ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## ఏటీఎంలో రూ. 2.66 లక్షల గోల్‌మాల్

- భార్యాభర్తల అరెస్ట్

అక్షర దర్బార్, ,మొగుళ్లపల్లి (జూన్ 16): కంఠాత్మకూర్, పరకాల పరిధిలోని హిటాచి పేమెంట్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఏటీఎం కేంద్రాలలో నగదు జమ చేయకుండా మోసానికి పాల్పడిన భార్యాభర్తలను మొగుళ్లపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్సై ముప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన వెల్దండి జమున, ఆమె భర్త వెల్దండి నరసింహారావు సదరు సంస్థ ఏటీఎం ఫ్రాంచైజీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఇందులో భాగంగా సంస్థ నుండి సేకరించిన నగదును నిర్ణీత సమయంలో ఏటీఎంలో జమ చేయాల్సి ఉండగా, వీరు సుమారు రూ. 2,66,100 నగదును జమ చేయకుండా దురుద్దేశపూర్వకంగా తమ సొంత అవసరాలకు వాడుకున్నారు. దీనిపై హిటాచి సంస్థ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నుండి తప్పించుకుంటూ తిరుగుతున్న నిందితులను మంగళవారం పట్టుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు వారికి 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై సురేష్ వెల్లడించారు.

# కాళేశ్వర ఆలయానికి కొత్త కళ

- మాస్టర్ ప్లాన్‌పై కమిషనర్ హనుమంతరావు సమగ్ర వివరణ
- ఆలయ ఈఓ కార్యాలయంలో గ్రామస్థులు, భక్తులతో సమావేశం
- నేటి నుంచి బాలాలయంలో స్వామివారి దర్శనాలు
- సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి



అక్షరదర్బార్, కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ఈఓ కార్యాలయంలో గ్రామస్థులు, భక్తులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆలయ మాస్టర్ ప్లాన్, చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలను వెల్లడించారు. ఆలయ విస్తరణ పూర్తయిన అనంతరం ఒకేసారి సుమారు 25 వేల మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉండి సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

### రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం రూ.198 కోట్ల నిధులు మంజూరు చేయగా, అష్ట తీర్థాల అభివృద్ధికి మరో రూ.60 కోట్లను కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. పక్షి తీర్థం, వ్యాస తీర్థం, జ్ఞాన తీర్థం తదితర తీర్థాలతో పాటు వివిధ ఘాట్ల నిర్మాణం, ఘాట్ నుంచి ఘాట్ వరకు పూర్తి స్థాయి రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### - మొదటి దశలో..

మొదటి దశలో ఆలయ దక్షిణ భాగం నుంచి పనులు ప్రారంభించి గర్భాలయం పరిసరాలు, చిన్న గోపురాలు, ప్రాకారాలు, కొన్ని ఉప ఆలయాల నిర్మాణ పనులను పూర్తి చేయనున్నట్లు హనుమంతరావు తెలిపారు. తూర్పు ప్రాకారం మినహా ఇతర పనులను ఈ దశలో పూర్తి చేస్తామని, గోదావరి పుష్కరాలు ముగిసిన అనంతరం మిగిలిన పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 2027 మే 8 నాటికి తొలి దశ నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

### నేటి నుంచి బాలాలయంలో దర్శనాలు

అభివృద్ధి పనుల నేపథ్యంలో నేటి నుంచి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి దర్శనాలు బాలాలయమైన శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో కొనసాగుతాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు.

### భక్తుల సహకారంతోనే..

అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం శృంగేరి పీఠాధిపతిని కాళేశ్వరానికి ఆహ్వానించి, గోదావరి పుష్కరాల లోపు ప్రారంభోత్సవం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొంటూ, గ్రామస్థులు, భక్తులు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, దేవస్థాన ఈఓ ఎస్ మహేష్, స్థపతి నాయక్, గ్రంథాలయ చైర్మన్ రాజబాపు, కాటారం ఆర్డీవో వెంకటేశ్వర్లు, సర్పంచ్ మోహన్ రెడ్డి, ధర్మకర్తలు సత్యనారాయణ, సీతయ్య, శ్యామ్, సీతారాం, దుర్గయ్య, అశోక్, పద్మ, రాజయ్య, శ్రీధర్ రావు, ఎక్స్ ఆఫీషియో నగేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అనకొండ

- ల్యాండ్ రికార్డ్స్ డీడీపై ఏసీబీ పంజా
- ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు.. 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- రూ.13.05 కోట్ల డాక్యుమెంట్ విలువ గల ఆస్తులు గుర్తింపు.. మార్కెట్ విలువ వందల కోట్లలో
- రూ.1.54 కోట్ల నగదు, రూ.5.04 కోట్ల ఎఫ్‌డీలు, రూ.2.29 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్ స్వాధీనం
- కిలోకు పైగా బంగారం, 8 కిలోల వెండి, విల్లాలు, ఫ్లాట్లు, లగ్జరీ కార్ల గుర్తింపు



అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో మల్టీ జోన్–II డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా విధులు నిర్వహిస్తున్న సుంకరి నరహరిరావు అవినీతి సామ్రాజ్యాన్ని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బట్టబయలు చేశారు. తన సర్వీస్ కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి, అవినీతి మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం నుంచి హైదరాబాద్‌లోని నరహరిరావు నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, సహచరులకు చెందిన మరో 9 ప్రాంతాల్లో (మొత్తం 10 చోట్ల) ఏసీబీ బృందాలు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించి సోదాలు చేపట్టాయి. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(b), 13(2) కింద ఈ చర్యలు తీసుకున్నారు.

### - వెలుగు చూసిన కుబేర ఆస్తులు

సోదాల్లో దొరికిన ప్రాథమిక పత్రాల ప్రకారం ఆస్తుల అధికారిక రిజిస్ట్రేషన్ విలువ రూ.13,05,67,100 (పదమూడు కోట్ల ఐదు లక్షల అరవై ఏడు వేల వంద రూపాయలు)గా ఏసీబీ నిర్ధారించింది. అయితే బహిరంగ మార్కెట్ (మార్కెట్ విలువ) ప్రకారం వీటి విలువ దీనికి కొన్ని రెట్లు ఎక్కువగా (రూ.200 కోట్లకు పైనే) ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### - పట్టుబడిన నగదు, డిపాజిట్లు


నికర నగదు (క్యాష్) రూ.1.54 కోట్లు (ఒక కోటి యాభై నాలుగు లక్షలు). ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.5.04 కోట్లు. బ్యాంక్ నిల్వలు రూ.2.29 కోట్లు. బంగారు ఆభరణాలు సుమారు 1.3 కిలోలు. వెండి వస్తువులు సుమారు 8 కిలోలు. నిందితుడి భార్య పేరిట ఉన్న రెండు బ్యాంక్ లాకర్లను ఏసీబీ గుర్తించింది. వీటిని దర్యాప్తులో భాగంగా త్వరలోనే తెరిచి పరిశీలించనున్నారు.

### - స్థిరాస్తుల వివరాలు (ఇళ్లు, ఫ్లాట్లు, భూములు)

రంగారెడ్డి జిల్లాలో 5 ఓపెన్ ప్లాట్లు. మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి. పుప్పాలగూడలోని ఒక హైరైజ్ బిల్డింగ్‌లో 2,500 చదరపు అడుగుల నివాస ఫ్లాట్. నార్సింగిలోని ఒక హైరైజ్ బిల్డింగ్‌లో ఒక్కొక్కటి 1,860 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన రెండు నివాస ఫ్లాట్లు. రాజేంద్రనగర్‌లోని ఒక హైరైజ్ బిల్డింగ్‌లో 1,377 చదరపు అడుగుల నివాస ఫ్లాట్. గచ్చిబౌలిలోని టీఎన్జీవోస్ కాలనీలో ఒక జీ+3 (నాలుగు అంతస్తుల) భవనం. చాత్రినాక ప్రాంతంలో ఒక జీ+2 నివాస భవనం. సోదాల్లో లగ్జరీ వాహనాలు ఒక 'కియా కారెన్స్ స్మార్ట్‌స్ట్రీమ్ జీ1.5 6ఎంటీ (పీ)' లగ్జరీ కారును స్వాధీనం చేసుకున్నారు.

### - రిమాండ్‌కు తరలింపు

ఈ సోదాల్లో దొరికిన అక్రమ ఆస్తుల కంటే అదనంగా ఇంకేమైనా ఆస్తులు ఉన్నాయా అనే కోణంలో ఏసీబీ అధికారులు మరింత వెరిఫికేషన్ జరుపుతున్నారు. ప్రస్తుతానికి కేసు దర్యాప్తులో ఉంది. నిందితుడైన అధికారి సుంకరి నరహరిరావును అదుపులోకి తీసుకున్న అధికారులు, జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ సెంట్రల్ జోన్ జాయింట్ డైరెక్టర్ ప్రెస్ నోట్‌లో ప్రకటించారు. నరహరిరావుకు చెందిన ఆస్తులపై ఏసీబీ అధికారులు దాడులు జరపటం సంచలనం కలిగించింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో ఒక అధికారి ఇంట్లో ఇంత భారీ నగదు దొరకటం ఇదే మొదటిది కావడం విశేషం. కొద్దిరోజుల క్రితం ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ అక్రమ ఆస్తులను గుర్తించిన ఏసీబీ అధికారులు తాజాగా నరహరిరావు అక్రమ ఆస్తులను కనుగొనటం తీవ్ర చర్చనీయాంశమైంది.



## పరకాల మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా విజయ్‌కుమార్

**పట్టణ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ప్రకటన**

అక్షరదర్బార్, పరకాల (జూన్ 16): పరకాల మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ ఫ్లోర్ లీడర్‌గా 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్‌ను నియమించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పగడాల కాళీ ప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ.. నూతన ఫ్లోర్ లీడర్ విజయ్‌కుమార్ నాయకత్వంలో మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి మరియు వార్డుల అభివృద్ధికి పార్టీ కౌన్సిలర్లు మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగిసిన కుంకుమేశ్వర ఆలయ భూమి సర్వే

- నాలుగు ఎకరాల భూమి స్వాధీనం!
- ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి చొరవతో హైకోర్టులో దేవస్థానానికి అనుకూలంగా తీర్పు

అక్షరదర్బార్, పరకాల (జూన్ 16): పరకాల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ కుంకుమేశ్వర దేవస్థానానికి చెందిన పశువుల సంత సర్వే నంబర్ 991 లో గల 4 ఎకరాల 11 గుంటల వివాదాస్పద భూమికి సంబంధించిన భూసరిహద్దుల సర్వే కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. గత ముప్పై సంవత్సరాలుగా ఈ విలువైన భూమిపై కోర్టులో వివాదం నడుస్తుండగా, స్థానిక ఎమ్మెల్యే రేగూరి ప్రకాశ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇటీవల హైకోర్టు ఈ భూమి శ్రీ కుంకుమేశ్వర దేవస్థానానికే చెందుతుందని తుది తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పు ప్రకారం సదరు భూమిని ఆలయ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. భూమి సరిహద్దులను శాశ్వతంగా నిర్ధారించేందుకు దేవస్థాన సర్వేయర్‌తో పాటు పరకాల ప్రభుత్వ సర్వేయర్ విజయ్‌కుమార్ సంయుక్తంగా కొలతలు చేపట్టారు. ఈ సర్వే కార్యక్రమం దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొలుగూరి రాజేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎ. నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ డి. అనిల్‌కుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఆలయ ఆస్తుల పరిరక్షణకు ఈ కోర్టు తీర్పు ఎంతో కీలకమని కమిటీ అధ్యక్షుడు రాజేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు నాగభూషణ శర్మ, కమిటీ సభ్యులు గోవింద సంధ్య సత్యనారాయణ, గౌరిశెట్టి నవీన్, జనార్ధన్ పాల్గొన్నారు.



# రైల్వే జంక్షన్లపై పోలీసుల నిఘా

- రంగంలోకి 4 స్పెషల్ టీమ్స్
- అంతర్రాష్ట్ర దొంగల ఆట కట్టిస్తాం.. సీపీ సన్‌ప్రీత్ సింగ్
- కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు



అక్షరదర్బార్, కాజీపేట: ప్రజల భద్రతే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా గుర్తు తెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనుమానితుల తనిఖీలను పోలీస్ కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నేరస్థులు వరంగల్ నగరానికి చేరుకుని ఇళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలను కలిపే ప్రధాన రైల్వే జంక్షన్లుగా వరంగల్, కాజీపేట స్టేషన్లు ఉండటంతో.. నేరస్థులు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుని నేరాలకు పాల్పడి, అనంతరం తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారని వివరించారు.

**- రాష్ట్రంలోనే మొదటిసారిగా 4 ప్రత్యేక బృందాలు**

ఈ తరహా అంతర్రాష్ట్ర నేరాలను అరికట్టేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, వరంగల్ రైల్వే స్టేషన్ లో రెండు, కాజీపేట రైల్వే స్టేషన్ లో రెండు ప్రత్యేక బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ఈ బృందాలు ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో 24 గంటలు షిఫ్ట్‌ల వారీగా నిరంతరం విధులు నిర్వహిస్తూ నిఘా ఉంచుతాయని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, జీఆర్‌పీ డీఎస్పీ కృపాకర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ అభినవ్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో గంజాయి ముఠా గుట్టురట్టు

- ఐదుగురు వ్యక్తులు అరెస్ట్!
- నిందితుల నుండి 210 గ్రాముల గంజాయి స్వాధీనం
- సీసీఎస్ సీఐ రమేష్

అక్షర దర్బార్, భూపాలపల్లి (జూన్ 16): భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు జరిపిన ప్రత్యేక తనిఖీల్లో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ఐదుగురు వ్యక్తుల ముఠాను అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ ప్రాంతంలో రహస్యంగా గంజాయి సేవిస్తున్న గడ్డిగానిపల్లికి చెందిన సెగ్గం సాయి వర్ధన్, సెగ్గంపల్లికి చెందిన దాసరి వంశీ, దుర్గం మహార్షిలను సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి అదుపులోకి తీసుకున్నారు. వారిని గట్టిగా విచారించగా వచ్చిన సమాచారం మేరకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన ప్రధాన గంజాయి సరఫరాదారులు జాడి మనోజ్, దుర్గం కిరణ్‌లను కూడా పోలీసులు పక్కా వ్యూహంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి మొత్తం 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి లోకల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.





## యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం

- మానసిక ఒత్తిడికి చెక్
- పరకాల గణపతి కాలేజీలో ముగిసిన మూడో రోజు యోగా శిక్షణ తరగతులు

అక్షరదర్బార్, పరకాల (జూన్ 16): యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది శరీరం, మనస్సు మరియు ఆత్మలను సమతుల్యం చేసే ప్రాచీన భారతీయ సంపూర్ణ జీవన విధానమని యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు అన్నారు. మంగళవారం గణపతి డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహించిన మూడో రోజు యోగా శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని విద్యార్థులకు వివిధ ఆసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతో పాటు నేటి ఆధునిక కాలంలో యువత ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి తగ్గి, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందన్నారు. దీర్ఘకాలిక శారీరక ఆరోగ్య సమస్యలను నివారించడంలోనూ యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శరీరం, మనస్సుల సమన్వయమే యోగా ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ విద్యార్థులు, యువత ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానాన్ని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.